క్లుప్తంగా

పంచాయతీ కార్మికుల ఆందోళన



గాండ్లపెంటలో దీక్షలో నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

గాండ్లపెంట: మండలంలోని 14 పంచాయతీల్లో పనిచేసే పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఆందోళన బాట పట్టారు. తమకు రావాల్సిన వేతనాలు మంజూరు చేయాలంటూ రిలే దీక్షకు దిగారు. మండల కేంద్రంలోని కదిరి–రాయచోటి రహదారి పక్కన దీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి అక్కులప్ప మాట్లాడుతూ ఒక్కో పంచాయతీలో 15 నెలల నుంచి 30 నెలల వరకు బకాయి వేతనాలు రావాల్సి ఉందన్నారు. తమకు రావాల్సిన వేతనాలను ప్రభుత్వం మంజూరు చేసే దాకా దీక్ష కొనసాగిస్తామని చెప్పారు. అక్కులప్ప, దొడ్డెప్ప, ఆంజినేయులు, అనిల్, బాలకృష్ణ, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట



పూజలు అందుకున్న గంగమ్మ తల్లి

తాడిమర్రి: ఎం.అగ్రహారం ఎస్సీ కాలనీలోని గంగమ్మ తల్లి ఆలయంలో గురువారం కాలనీ వాసులు అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు జయరామయ్య శర్మ ఆధ్వర్యంలో మహా గణపతి, నవగ్రహాల హోమం తదితర పూజలు చేపట్టారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట చేశారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఏబీ ఓబిరెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ గుడి కట్టుదారులు దాసరి గంగాధర్, కళావతి, గ్రామ పెద్దలు చిల్లా శివయ్య, రామాంజనేయులు, అప్పస్వామి, కృష్ణాపురం రమేష్, నాగరాజు, ఓబుళప్ప తదితరులు పాల్గొన్నారు.

నీరు కలుషితం కాకుండా చూడండి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి

కదిరి అర్బన్: వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా చూడాలని ఎంపీపీ తోట అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన తక్షణమే పరిష్కారం చూపాలని సూచించారు. అనంతరం అజెండా మేరకు పలు శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను సభలో చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పోలప్ప, తహసీల్దార్ మురళీకృష్ణ, ఈఓఆర్డీ అంజనప్పతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పుట్టపర్తి టౌన్: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీహెచ్ఓ నగేష్, డీటీసీ సూపర్‌వైజర్ అబీబ్ బాషా పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తిలో 10 వార్డు గోకులం, కరణం సుబ్బమ్మనగర్‌లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల వల్ల అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. తాగునీటి ట్యాంకులు, బోరు బావులు క్లోరినేషన్ చేసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సుహాషిణి, అమృత తదితరులు పాల్గొన్నారు

విధులు సక్రమంగా నిర్వహించండి

హిందూపురం: ఆరోగ్య కేంద్రాల్లో రోజు డాక్టర్లు, వైద్య సిబ్బంది ఎవరైనా విధులపై ఎక్కడికి వెళ్లినా ప్రోగ్రామ్‌ను ఆన్‌లైన్‌లో తప్పకుండా నమోదు చేయాలని, లేకపోతే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఫిరోజ్ బేగం హెచ్చరించారు. హిందూపురం మండలంలోని బేవనహళ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు.

ఘనంగా హనుమజ్జయంతి



చెన్నేకొత్తపల్లి: ఆలయం వద్ద హోమం చేస్తున్న అర్చకులు



శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



సైదాపురం హనుమాన్ ఆలయానికి తరలివచ్చిన భక్తులు

చెన్నేకొత్తపల్లి: చెన్నేకొత్తపల్లి, న్యామద్దెల, నాగసముద్రం, ఎన్ఎస్ గేట్ తదితర గ్రామాల్లో గురువారం హనుమజ్జయంతి ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ఆంజనేయుడి మూలవిరాట్‌లకు అభిషేకాలు చేశారు. ఆకుపూజ అనంతరం వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. న్యామద్దెలలోని ఆంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో హోమం చేశారు. ఆయా గ్రామాల్లోని భక్తులు దేవాలయాలకు వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నదానం చేపట్టారు.

హనుమజ్జయంతి పురస్కరించుకుని దేవాలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రం కనగానపల్లి, మామిళ్లపల్లి, తగరకుంట గ్రామాల్లోని ఆంజనేయస్వామి దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామిని తమలపాకులు, పూలతో అలంకరించారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు, శ్రీరామ కీర్తనలతో భజనలు చేశారు.

కదిరి టౌన్: పట్టణంలోని సైదాపురం ఆంజనేయ స్వామి ఆలయం, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంతో పాటు పలు ఆలయాల్లో గురువారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయమే స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.



కనగానపల్లి: ఆకుపూజ అలంకరణలో ఆంజనేయుడు



పోట్లమర్రిలో పూజలందుకున్న వాయుపుత్రుడు



ముదిగుబ్బ: అలంకరణలో ఆంజనేయస్వామి

అంజన్నకు ప్రత్యేక పూజలు



బీడుపల్లిలో ఆంజనేయస్వామి ఆలయంలో యజ్ఞం నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులు డాక్టర్ అరుణ, మల్లికార్జునరెడ్డి దంపతులు



పుట్టపర్తిలో ప్రత్యేక పుష్పాలంకరణతో ఆంజనేయస్వామి

పుట్టపర్తి టౌన్: పట్టణంలో హనుమజ్జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని 17వార్డు బీడుపల్లిలోని అభయాంజనేయస్వామి ఆలయంలో స్నేహలత నర్సింగ్ హోం అనంతపురం యజమాని డాక్టర్ అరుణ, మల్లికార్జునరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. పురోహితుల గురుస్వామి, శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. గణపతి పూజ, స్వస్తి వాచకం, రక్షాధారణ, కలశస్థాపన, హనుమద్ సూక్తం ,పంచాభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణం, హనుమద్ హోమం నిర్వహించారు. పట్టణంలోని హనుమాన్ ఆలయంలో స్వామిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. సాయంత్రం హనుమంతుడుని పట్టణ పురవీధుల్లో రామనామ సంకీర్తనలు, సాయి నామస్మరణతో భజనలు చేసుకుంటూ వీధివీధినా తిరిగారు.

తలుపుల: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆకుపూజ, కుంకుమార్చన , పంచామృతాభిషేకం చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

బత్తలపల్లి: ఆంజనేయస్వామి జయంతిని గురువారం పోట్లమర్రి, వేల్పుమడుగు, గుమ్మళ్లకుంట, విశ్వనాథపురం, మాల్యవంతం, సంజీవపురం, ఎం.చెర్లోపల్లి, ముష్టూరు, సంగాల తదితర గ్రామాల్లో వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో గణపతి పూజ, క్షీరాభిషేకం, సహస్ర నాగవల్లి పూజ, శ్రీహరి వాయుస్తుతితో తేనేభిషేకం , ఆకుపూజ, వడమాల, ఆంజనేయస్వామి మహాత్మ్యం ప్రవచనం చేపట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. సంగాలలో సర్పంచు కంచనగారి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు.

నల్లచెరువు: మండలంలో ప్రసిద్ధి చెందిన పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఈట రవీంద్రరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక వాహనంలో స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో పెద్దకోట్లపల్లి ఆంజనేయ స్వామి

నల్లమాడ: మండలంలోని పెద్దకోట్లపల్లి, రెడ్డిపల్లి, ఎద్దులవాండ్లపల్లి తండాలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆంజనేయ స్వామి మూలవిరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ముదిగుబ్బ: దామానుపల్లిలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆంజనేయ స్వామి పంచలోహ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. పూజారి లక్ష్మయ్య స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కదిరి అర్బన్: హనుమాన్ జయంతి సందర్భంగా పట్టణంలో గురువారం శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథితో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నిత్యజీవితంలో యోగా భాగం కావాలి



చెన్నేకొత్తపల్లిలో యోగా చేస్తున్న ప్రజలు



తాడిమర్రిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరంగారావు



నల్లమాడలో యోగా సాధన చేస్తున్న సిబ్బంది



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ క్రాంతి కుమార్

పుట్టపర్తి టౌన్: మనిషి నిత్య జీవితంలో యోగా ఒక భాగం కావాలని ఆర్డీఓ సువర్ణ, కమిషనర్ క్రాంతికుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ హాల్‌లో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆర్డీఓ సువర్ణ అధ్యక్షతన జిల్లా స్థాయి అధికారులు, ఎంపీడీఓలు, పట్టణ ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా భారీ ఎత్తున కార్యక్రమాలు జరగనున్నాయన్నారు. రాష్ట్రంలో విశాఖపట్నంలో జరగనున్న యోగా కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ హాజరుకానున్నట్లు తెలిపారు. నెల రోజుల ముందు నుంచే యోగా అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పుట్టపర్తి పట్టణంలో గణేష్ కూడలిలో షాదీమహల్‌లో జిల్లా స్థాయి యోగా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ నరసయ్య, ఆర్ఐ నరసింహులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

నల్లమాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో యోగాపై గురువారం రిహార్సల్స్ చేశారు. తహసీల్దార్ రంగనాయకులు,ఎంపీడీఓ ఆజాద్, ఎంఈఓ వేమనారాయణ, ఉపాధ్యాయులు రవీంద్రారెడ్డి హాజరై సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. వారు మాట్లాడుతూ శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో యోగా కార్యక్రమం ఉంటుందన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల మండల సిబ్బంది, అధికారులు, ప్రజలు ప్రతి ఒక్కరూ యోగా కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

యోగాతో ఆరోగ్యకరమైన జీవనం

చెన్నేకొత్తపల్లి: యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఒక భాగం చేసుకోవాలి. యోగాతో ఆరోగ్యకర, సంతోషకరమైన జీవితాన్ని గడపవచ్చని ఎంపీడీఓ బాలక్రిష్ణుడు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. యోగా చేయడం వలన శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. సిద్ధ సమాధి యోగా గురువు జయరామిరెడ్డి హాజరైన వారితో యోగాసనాలు వేయించారు. అలాగే యోగా చేయడం ద్వారా కలిగే లాభాలను వివరించారు.

తాడిమర్రి: యోగాతో మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం లభిస్తుందని ఎంపీడీఓ వెంకట రంగారావు పేర్కొన్నారు. యోగా దినోత్సవం పురస్కరించుకుని గురువారం ఆయన మండల అధికారులు, గ్రామస్తులతో కలసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఎంఈఓ కృష్ణమోహన్, డిప్యూటీ ఎంపీడీఓ విజయ్ శేఖర్‌నాయుడు, ఏపీఓ అనిల్ కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: యోగా సాధనతో ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందవచ్చని ఎంపీడీఓ నరసింహనాయుడు, డిప్యూటి ఎంపీడీఓ క్రిష్టప్ప పేర్కొన్నారు. గురువారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మనిషి దిన చర్యలో యోగా, ధ్యాన సాధనను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాఆరయణస్వామి, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి వెంకటరమణ, వివిధ రాజకీయ పార్టీల నేతలు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

ముదిగుబ్బ: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం లభిస్తుందని డిప్యూటి డీఎంహెచ్ఓ నాగేంద్రనాయక్ అన్నారు. గురువారం యనమలవారిపల్లిలో ఎస్‌యూఓ దేవ్లానాయక్, ఎంపీహెచ్ఈఓ వేణుగోపాల్‌రెడ్డి, సూపర్‌వైజర్ శశిధర్, రవి శంకర్‌లతో కలసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మలేరియాపై రక్త నమూనాలు సేకరించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. హెల్త్ అసిస్టెంట్లు నరేంద్రరెడ్డి, రామచంద్ర, దేశే నాయక్, బాలాజీ నాయక్, మున్నా, మస్తాన్‌వలి, శ్రీనివాసరెడ్డి, హరినాథ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సచివాలయ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ మరింత బలోపేతానికి కృషి



పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీపతిరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఓడీచెరువు: పార్టీ గ్రామస్థాయిలో మరింత బలోపేతానికి కృషి చేస్తామని మండల కన్వీనర్ లక్ష్మీపతిరెడ్డి అన్నారు. మండల కన్వీనర్‌గా నియమితులైన కుప్పనగారి లక్ష్మీపతిరెడ్డిని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు గురువారం సన్మానించారు. ఈసందర్భంగా మండల కన్వీనర్ మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. అందరినీ కలుపుకొని పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భర్త షామీర్ బాషా, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, సర్పంచులు తొట్లి రంగారెడ్డి, గోవిందు, నాయకులు కుర్లి రంగారెడ్డి, చింతా రామచంద్రారెడ్డి, బయపరెడ్డి, నరసింహారెడ్డి, రామస్వామి రెడ్డి, సుకన్య, రాఘవ, పాల సూరి, ఇంద్రప్ప, నరసింహులు, చిన్నప రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు



సర్వే నంబర్ 182లోని ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసుకున్న అక్రమ నిర్మాణాలు

తనకల్లు: మండలంలోని బొంతలపల్లి పంచాయితీకి చెందిన సర్వే నంబర్ 182లో ఉన్న ప్రభుత్వ భూమిలో కొందరు అక్రమంగా ఇంటి నిర్మాణాలు చేపట్టారు. ఈ పరిసరాలు అన్నమయ్య జిల్లా మొలకలచెరువుకు అతి సమీపంలో ఉండడంతో అక్కడ భూములకు భారీ డిమాండ్ ఉంది. సెంటు భూమి రూ. లక్షలు పలుకుతోంది. దీంతో మొలకలచెరువు పరిసర గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని రాత్రికి రాత్రే షెడ్‌లను ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ఇళ్లు, షెడ్లు కడుతున్నా రెవెన్యూ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ విషయమై 'సాక్షి' తహసీల్దార్ శోభా సువర్ణమ్మ వివరణ కోర గా సర్వే నంబర్ 182లో ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు తమ దృష్టికి వచ్చిందని, వెంటనే వారికి నోటీసులు జారీ చేస్తామన్నారు.

ట్రాక్టర్లు ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్



నూతన వాహనాలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

కదిరి టౌన్: పట్టణంలో పారిశుధ్య పనుల కోసం రూ.29.73 లక్షలు వ్యయంతో నూతనంగా రెండు ట్రాక్టర్లు, 50 చెత్త బండ్లను కదిరి మున్సిపల్ చైర్మన్ దిల్షాదున్నీషా గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు సుధారాణి, రాజశేఖరాచారి, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

'ఉపాధి పనుల్లో యంత్రాలు ఉపయోగించలేదు'

ఓడీచెరువు: మండలంలోని వెంకటాపురం పంచాతీలో నిర్వహించిన ఫారంపాండ్ల పనుల్లో యంత్రాలు వాడలేదని ఏపీడీఓ జ్యోతి తెలిపారు. గురువారం ఏపీడీ క్షేత్రస్థాయిలో పర్యటించి, విచారణ చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలో గ్రామ వికాస శ్రామికులు పనులు చేస్తున్నట్లు గుర్తించామని, యంత్రాలతో పనులు చేస్తున్నారన్న దానిపై విచారించగా, తామే ఫారంపాండ్ల పనులు చేస్తున్నట్లు చెప్పారన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్‌తో కలిసి సిబ్బందితో మాట్లాడారు. ప్రతి గ్రామ పంచాయతీలోనూ 25 ఫారంపాండ్లు తవ్వించాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ మంజుల, ఈసీ షెక్షావలి, టీఏలు సాయినాథరెడ్డి, లక్ష్మీకరరెడ్డి, ఆంజనేయులు, ఈశ్వర రెడ్డి, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు హెచ్చరికలు చేస్తున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

ధర్మవరం రూరల్: మండలంలోని పలువురు రౌడీషీటర్లకు గురువారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ హేమంత్‌కుమార్ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాలలో గొడవలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది వున్నారు.

పార్టీ పటిష్టతకు అంకిత భావంతో పనిచేస్తాం



రవినాయక్, పుట్టపర్తి టౌన్ కన్వీనర్



ఈశ్వరయ్య, పుట్టపర్తి రూరల్ మండల కన్వీనర్



పల్లగొర్ల కేశప్ప, బుక్కపట్నం మండల కన్వీనర్



శ్యామ్ సుందర్‌రెడ్డి, కొత్తచెరువు కన్వీనర్



ఆదినారాయణరెడ్డి, నల్లమాడ మండల కన్వీనర్



లక్ష్మీపతిరెడ్డి, ఓడీచెరువు మండల కన్వీనర్



జయప్ప, అమడగూరు మండల కన్వీనర్

పుట్టపర్తి: గ్రామస్థాయిలో పార్టీ పటిష్టతకు అంకితభావంతో పనిచేస్తామని నూతనంగా నియమింపబడిన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు పేర్కొన్నారు. పుట్టపర్తి టౌన్, పుట్టపర్తి రూరల్, బుక్కపట్నం, కొత్తచెరువు, అమడగూరు, నల్లమాడ, ఓడీచెరువు, అమడగూరు మండలాల పార్టీ నూతన కన్వీనర్లు రవి నాయక్, ఈశ్వరయ్య, పల్లగొర్ల కేశప్ప, శ్యామ్ సుందర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, తనకంటి జయప్ప పార్టీ నూతన మండల కన్వీనర్లుగా నియమితులయ్యారు.ఈసందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి మండలా బాధ్యతలు అప్పగించిన వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. మండలంలోని ప్రతి ఒక్కరినీ కలుపుకొని పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేస్తామన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులను సన్నద్ధం చేస్తామన్నారు.